RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 18 | డిసెంబర్ 20, 2025 | వెల : రూ.3-00



4లో..

**41 మంది మావోయిస్టుల లొంగుబాటు**

# ఢిల్లీ.. ఉక్కిరి బిక్కిరి..!

## - కాలుష్య కోరల్లో దేశ రాజధాని



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**


దేశ రాజధాని ఢిల్లీ వాయు కాలుష్య కోరల్లో పూర్తిగా చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వరుసగా కొన్ని రోజులుగా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయిలో పడిపోవడంతో నగరం మొత్తం కాలుష్యకూపంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు దట్టమైన పొగమంచు, కాలుష్య మేఘాలు నగరాన్ని కమ్మేయడంతో స్వచ్ఛమైన గాలికి బదులు విషవాయువులే ప్రజల ఊపిరితిత్తుల్లోకి చేరుతున్న పరిస్థితి నెలకొంది. సాధారణ ప్రజలు శ్వాస తీసుకోవడానికే ఇబ్బందులు పడుతుండగా, చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడేవారు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. ఆసుపత్రుల్లో శ్వాసకోశ సమస్యలతో వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ఎయిర్ క్వాలిటీ ఏమాత్రం మెరుగుపడడం లేదు. దీంతో తాజాగా ప్రభుత్వం నాన్ బీఎస్-6 వాహనాలను ఢిల్లీలోకి రాకుండా నిషేధం విధించారు. ఈ పరిస్థితి అదుపులోకి రావాలంటే కొన్ని రోజులు కట్టుదిట్టమైన చర్యలు తప్పవని నిపుణులు చెబుతున్నారు.

**- 437కి చేరిన ఏక్యూఐ..**

కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు విడుదల చేసిన 'సమీర్' యాప్ ప్రకారం తాజాగా ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 437గా నమోదైంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ 400 మార్కును దాటడంతో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇది


మిగతా 3వ పేజీలో..

- ☐ గాలిలో కలిసిపోతున్న విష వాయువులు
- ☐ 437కి చేరిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- ☐ కొన్ని రోజులుగా 'సివియర్ ప్లస్'లో గాలి నాణ్యత
- ☐ శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బందే..
- ☐ విమానాల రాకపోకలకు బ్రేక్.. వందల ఫ్లైట్లు ఆలస్యం
- ☐ తాజాగా 'నాన్ బీఎస్-6 వాహనాలకు నో ఇంట్రీ' నిర్ణయం
- ☐ ఏక్యూఐ మెరుగుపడేలా ఢిల్లీ సర్కార్ చర్యలు
- ☐ స్వచ్ఛమైన శ్వాస కోసం పోరాడుతున్న నగరం



## పారంపర్య వైద్యానికి భారత్ గ్లోబల్ వేదిక

- ప్రధాని నరేంద్ర మోదీ
- డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా ముగింపు
- మూడు రోజుల పాటు ప్రపంచ నిపుణుల లోతైన చర్చలు
- ఆయుష్ రంగంలో భారత్ నాయకత్వానికి గుర్తింపు



**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**

రెండో డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ సమ్మిట్ ఆన్ ట్రెడిషనల్ మెడిసిన్ విజయవంతంగా ముగియడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతృప్తి వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా ప్రపంచ వ్యాప్తంగా పారంపర్య వైద్య రంగానికి చెందిన నిపుణులు పాల్గొని చర్చలు జరిపినట్లు ప్రధాని పేర్కొన్నారు. పారంపర్య వైద్య విధానాల భవిష్యత్, ప్రజారోగ్యంలో వాటి పాత్ర, ఆధునిక వైద్యంతో సమన్వయం వంటి అంశాలపై ఈ సమ్మిట్‌లో విస్తృతంగా చర్చలు జరిగాయని మోదీ తెలిపారు. వివిధ దేశాల అనుభవాలు, పరిశోధనలు పంచుకోవడం ద్వారా ఈ సదస్సు ప్రపంచా

మిగతా 4వ పేజీలో..

## సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలి

- ప్రభుత్వ ప్రచారం బలోపేతం చేయాలి
- ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సమన్వయంతో ముందుకెళ్లాలి
- ప్రజా సంబంధాల అధికారుల పాత్ర కీలకం
- డీపీఆర్‌వోల నియామకాలు, పదోన్నతులు వేగవంతం చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




వేగంగా మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నాంపల్లిలో తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ప్రజా సంబంధాల అధికారుల పునశ్చరణ తరగతుల

మిగతా 3వ పేజీలో..

## రూ.1300 కోట్ల ల్యాండ్ సేఫ్!

- నిజాంపేటలో 13 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
- అక్రమ షెడ్ల తొలగింపు, ఫెన్సింగ్ ఏర్పాటు
- రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన



4లో..

## ఆదివాసీలను ప్రభుత్వం విస్మరించింది

- ☐ గిరిజనుల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ☐ ఓసీ -2 మైన్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం
- ☐ గుత్తికోయ తాండా నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి
- ☐ రామాలయ అభివృద్ధికి ఇచ్చినా హామీ ఏమైంది
- ☐ జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్
- ☐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటన




**వేద్య న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం:**

గిరిజనులు, ఆదివాసీలను నిర్లక్ష్యం చేస్తూ వారి అభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించిన కవిత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గిరిజనులను మభ్యపెట్టి సీతక్క, రేవంత్ రెడ్డి

మిగతా 3వ పేజీలో..

## కేంద్ర ఆర్థిక మంత్రితో చంద్రబాబు భేటీ

- పోలవరం నల్లమల సాగర్‌కు కేంద్ర సహకారం కోరిన ఏపీ సీఎం
- పూర్వోదయ నిధులతో రాష్ట్ర అభివృద్ధికి చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి
- యూనిటీ మాల్, హేవ్‌లాక్ బ్రిడ్జి, రాయలసీమ హార్టికల్చర్ ప్యాకేజీపై చర్చ



**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రితో విస్తృతంగా చర్చించారు. కరవు పీడిత ప్రాంతాల దాహార్తిని తీర్చడంతో పాటు సాగునీటి అవసరాల కోసం గోదావరి వరద జలాల మళ్లింపును లక్ష్యంగా చేపట్టే పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని ఎండాభావిత ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. అలాగే విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, హౌసింగ్, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు వంటి కీలక రంగాల్లో పూర్వోదయ నిధులు కేటాయించి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవనానికి ఈ రంగాల్లో పెట్టుబడులు

మిగతా 4వ పేజీలో..

# గ్రామ పాలనకు పెద్దపీట



- గ్రామపంచాయతీలే రాష్ట్రాభివృద్ధికి పునాది
- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి
- కాసిపేట మండల నూతన సర్పంచులకు సన్మానం

**వేద న్యూస్, కాసిపేట:**

కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యానికి, గ్రామ స్వయంపాలనకు ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీల బలోపేతానికి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాసిపేట మండలానికి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని, ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సర్పంచ్‌లకు సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాల్సిన బాధ్యత సర్పంచ్‌లదేనని అని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో గ్రామీణ ప్రజల జీవన ప్రమాణం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీ, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బన్న లక్ష్మన్ దాస్, రాపర్తి శ్రీనివాస్, విక్రమ్ రావ్, ఉత్తురి సత్తయ్య, నస్పూరి నర్సింగం, రౌతు సత్తయ్య, దారవేణి రాజయ్య, రేషవేని బాపుగోలేటి స్వామి, రమేష్, బుక్య రాంచందర్, పుర్ర కుమార స్వామి, భూక్య రవి, దుస్స చందు, శిలార్ ఖాన్, భీమ్ నాయక్, ఆత్రం జంగు, మండల సర్పంచ్లు బాదావత్ నీల, చాకటి సుగుణ, దుస్స విజయ, భూక్య స్వప్న, భూక్య చైతన్య, బాణోత్ రాణి, నవనందుల పుష్పలత, మాడావి వెంకటేష్, పంద్రం శంకర్, ఆడే దివ్య, ఉప సర్పంచ్లు రమేష్, సూరం కిషన్, ఆల్క రాజు, మెంద్రపు రాజయ్య, శారద, మల్లెత్తుల సందీప్, మద్దెవేని వేణు, పానుగంటి అశోక్, నగేష్, నామాసాని రాజు, మారం లచ్చన్న, బలరాం, స్వామి, షారుక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి

**వేద న్యూస్, కాసిపేట:**



కాజీపేట దర్గా ఏరియాలో గల పోచమ్మ గుడి ఎదుట ఒక గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఉందని కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. వయస్సు సుమారు 65 సంవత్సరాలు, ఎత్తు 5.5 అడుగులు ఉంటుందన్నారు. మృతదేహంపై నలుపు రంగు టీషర్ట్, కాఫీ రంగు లోయర్ ఉందని తెలిపారు. ఇతను భిక్షాటన చేసే వ్యక్తి అయినందున సరైన ఆహారం, నీరు లేక అనారోగ్యంతో చనిపోయి ఉండొచ్చని సీఐ తెలిపారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తుపట్టినట్లయితే కాజీపేట పోలీస్ స్టేషన్లో లేదా 8712685008, 8712685246 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.


# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వేద న్యూస్, కాసిపేట:**

నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొండాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నందున విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మరమ్మతుల కారణంగా కాజీపేట మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మండల ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

# యూరియా కొనుగోళ్లు యాప్ ద్వారానే

- రైతులకు మండల వ్యవసాయ అధికారి సూచన




**వేద న్యూస్, కాసిపేట:**

నేటి నుంచి యూరియా ఎరువుల కొనుగోలు కేవలం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే జరుగుతుందని కాసిపేట మండల వ్యవసాయ అధికారి చల్ల ప్రభాకర్ తెలిపారు. పట్టాదారులు, పట్టా లేని రైతులు, కౌలు రైతులు తమ మొబైల్ లేదా ఆధార్ నెంబర్ ద్వారా ముందుగా యాప్‌లో బుకింగ్ చేసుకుని మాత్రమే డీలర్ వద్ద యూరియా తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. యూరియా అమ్మే ప్రతి డీలర్ ఈ యాప్ ద్వారానే విక్రయాలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. యాప్ ద్వారా జిల్లాలోని రిటైలర్ల వద్ద అందుబాటులో ఉన్న స్టాక్‌ను రైతులు తెలుసుకోవచ్చని, బుకింగ్ పూర్తయ్యాక ప్రత్యేక బుకింగ్ ఐడీ లభిస్తుందని చెప్పారు. బుకింగ్ 24 గంటలు మాత్రమే చెల్లుబాటు అవుతుందని, ఆ సమయంలో యూరియా తీసుకోకపోతే బుకింగ్ రద్దు అవుతుందని వివరించారు. రైతులు ప్లే స్టోర్ నుంచి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి



- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్

**వేద న్యూస్, చొప్పదండి రామడుగు:**

ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలల్లో మన ఉనికిని బలంగా చాటామని రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసి ఎన్నికల్లో సైతం మరోమారు ఇదే ఉత్సహంతో పనిచేసి మన సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలో సర్పంచ్, ఉపసర్పంచ్లుగా గెలుపొందిన వారిని శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు మోడీ రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రంలో సన్మానిచారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ... కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో కేంద్రం నుండి వచ్చే నిధుల వల్లే నేడు గ్రామాలు అభివృద్ధి బాటలో ఉన్నాయనే నిజం గ్రామాలలో ప్రజలు గుర్తించారనడానికి మన పార్టీ కార్యకర్తల విజయమే సంకేతం అన్నారు. ఇవే అస్త్రాలుగా మరో మారు ప్రజల్లో కి తీసుకెళ్ళి ఓట్లు అడగాలని అన్నారు.

# సింగరేణి వేడుకలు కొనసాగించలి

- ఎస్సీడబ్ల్యూయూ - ఏఐటీయూసీ డిమాండ్

**వేద న్యూస్, కాసిపేట:**

సింగరేణిలో ఈ నెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిలిపివేయకుండా కొనసాగించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) బెల్లంపల్లి బ్రాంచి నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం డిసెంబర్ 23న సింగరేణి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని గుర్తు చేశారు. ఈ వేడుకలు ఉద్యోగుల మనోధైర్యం, ఐక్యత, సంస్థపై గౌరవాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఇటీవల వేడుకలను నిలిపివేయనున్నట్లు సమాచారం రావడం ఉద్యోగుల్లో నిరాశకు కారణమవుతుందని పేర్కొన్నారు. కావున గత సంవత్సరాల మాదిరిగా అన్ని ఏరియాల్లో కంపెనీ స్థాయిలో సింగరేణి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# టెక్నాలజీలో మరింత అభివృద్ధి చెందాలి



- అప్పుడే దేశం విశ్వగురువుగా కీర్తించబడుతుంది
- చైనా పారిశ్రామిక అభివృద్ధితోనే ప్రపంచాన్ని శాసిస్తోంది
- సైన్స్ ఫెయిర్ విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తుంది
- జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారతదేశం మరింత అభివృద్ధి చెందాలని, అప్పుడే విశ్వ గురువుగా కీర్తించబడుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. పాఠశాల విద్యాశాఖ, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్ ఆవరణలో ఆయన జ్యోతీ ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డీఈవో ఎల్. వి. గిరిరాజ్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే టెక్నాలజీ మరింత పురోభివృద్ధి అవసరమన్నారు. చైనా వ్యవసాయ రంగంలోకన్నా, పారిశ్రామికరంగ అభివృద్ధితోనే ప్రపంచాన్ని శాసిస్తున్నదన్నారు. స్వాతంత్రం వచ్చాక మొట్టమొదటి ప్రధాని నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియాలో భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశంగా గుర్తింపున్నా, శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందితేనే అభివృద్ధి సాధిస్తుందని పేర్కొంటూ ఇంజనీరింగ్ కళాశాలలను, పరిశ్రమలను ఏర్పాటు చేశారన్నారు. అయితే ఆయన కల కలగానే ఉన్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా కమిషన్ ను ఏర్పాటు చేసి వచ్చే ఏడాది నుండి నూతన విద్యా ప్రణాళికను ప్రారంభించబోతుందన్నారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులు తీసుకువచ్చే ప్రదర్శనలు సృజనాత్మకతతో కూడిన కొత్త ఆలోచనలతో ఉండాలన్నారు. జిల్లాస్థాయి నుండి 12 ఎగ్స్ బిట్స్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు గత సంవత్సరం ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుత హనుమకొండ ఎమ్మెల్యే జిల్లా సైన్స్ సెంటర్ అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరయ్యేలా కృషి చేశారని, తాను సీఎంతో మాట్లాడి స్పెషల్ డెవలప్మెంట్ నిధులు మరిన్ని మంజూరు చేయించి మళ్లీ వచ్చే సైన్స్ ఫెయిర్ నాటికి జిల్లాసైన్స్ కేంద్రం అభివృద్ధికి తోడ్పడతానన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ... సైన్స్ ఫెయిర్ అంటే ఒక మోడల్ ను, ఒక ఎగ్జిబిట్ ను ప్రదర్శించడం కాదని, పరస్పరం విజ్ఞానాన్ని షేరింగ్ చేసుకోవడం అన్నారు. డీఈవో గిరిరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పుడు కూడా కొత్త ఆలోచనలతో ప్రశ్నలు అడగాలని అన్నారు. తరగతి గదిలో ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మేన శ్రీను, స్థానిక కార్పొరేటర్ నల్లా స్వరూపారాణి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, హనుమకొండ ఎంఈఓ నెహ్రూ నాయక్, సెయింట్ పీటర్స్ విద్యాసంస్థలు అధినేత నారాయణరెడ్డి, సెయింట్ పీటర్స్ ఎడ్యు విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఎన్. అనిత, వడుస అధినేత మాదాల సతీష్, సీఎంఓ బద్దం సుదర్శన్ రెడ్డి, హసన్పర్తి ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, కాజీపేట ఎంఈఓ మనోజ్ కుమార్, కోఆర్డినేటర్లు మహేష్, మన్మోహన్, సునీత, వివిధ కమిటీల కన్వీనర్లు, కో- కన్వీనర్లు పాల్గొన్నారు. సైన్స్ ఫెయిర్ ను సందర్శించడానికి మొదటి రోజు హనుమకొండ, ఆత్మకూరు, హసన్పర్తి, శాయంపేట, వేలేరు, భీమదేవరపల్లి, పరకాల మండలాల నుండి పెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# కాట్నపల్లి సర్పంచ్‌కు ఘనసన్మానం

- వినాయక తాపీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

**వేద న్యూస్, సుల్తానాబాద్:**



కాట్నపల్లి గ్రామ నూతన సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ ను శుక్రవారం వినాయక తాపీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌ను వారి నివాసంలో కలిసి.. పూజ రాజేందర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో ఇరువురిని ఘనంగా సన్మానించారు. ప్రజల ఆదరభిమానాలు చూరగొని సర్పంచ్‌గా ఎన్నికయిన పూజ రాజేందర్ చక్కటి నాయకులుగా పేరు సంపాదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వినాయక తాపీ కార్మిక సంఘం వారు మాట్లాడుతూ... నిరుపేద కుటుంబం నుంచి వచ్చి.. కూలీ(పార) పని చేసి అనంతర కాలంలో తాపీ మేస్త్రీగా (బిల్డర్‌గా) ఎదిగిన రాజేందర్ రాజకీయ రంగంలోనూ విజయం సాధించారని పేర్కొన్నారు. రాజేందర్ తన సతీమణి పూజను సర్పంచ్‌గా నిలిపి ప్రజల ఆశీర్వచనాలతో గెలిపించి.. చక్కటి సేవలందించేందుకు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. సర్పంచ్‌గిరిని బాధ్యతాయుతంగా పూజ రాజేందర్ నిర్వర్తిస్తారని వెల్లడించారు. కాట్నపల్లి గ్రామాన్ని మండలంలో అగ్రగామిగా వారు నిలుపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వీరు మరిన్ని ఉన్నత పదవులు అలంకరించారని, వారి ద్వారా ప్రజలకు మేలు కలగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినాయక తాపీ కార్మిక సంఘం అధ్యక్షుడు కె.స్వామి, కార్యదర్శి ఏ.రత్నం, ఉపాధ్యక్షులు ఎం.దేవేందర్, బి.నర్సయ్య, గౌరవ అధ్యక్షుడు వై.రమేశ్, సంతోష్, వెంకటస్వామి, మహేశ్, రాజు, మల్లికార్జున్, అజ్జు, శంకర్, జి.నారాయణ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

**వేద న్యూస్, వరంగల్ పశ్చిమ:**



గ్రేటర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ 29వ డివిజన్ రామన్నపేటలో అక్టోబర్ 30వ తేదీన కురిసిన అకాల వర్షాలకు చాలా ఇళ్లలో నిత్యవసర సరుకులు, సామాగ్రి నేల మట్టమయ్యాయి. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డిని ఈ ప్రాంతానికి తీసుకొచ్చి నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తరఫున సహాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా సీఎం తక్షణమే స్పందించి 932 కుటుంబాలకు 15000 చొప్పున వారి ఖాతాలో జమ చేయడం జరిగింది. అలాగే నష్ట పోయిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున సన్నబియ్యం కూడా అందించాల ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణ, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు ఎమ్మెల్యే, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

# శ్రామిక శక్తికి ప్రజల పట్టం

- కూలీ పని చేసి.. తాపీ మేస్త్రీగా ఎదిగిన రాజేందర్
- రాజకీయాల్లోనూ రాణింపు..తొలిసారి స్థానిక బరిలో నిలిచి విజయం
- కాట్నపల్లి నూతన సర్పంచ్‌గా ఓగుల పూజ రాజేందర్





**వేద న్యూస్, సుల్తానాబాద్:**

శ్రామిక శక్తికి కాట్నపల్లి ప్రజలు పట్టం కట్టారు. కాట్నపల్లి నూతన సర్పంచ్‌గా కష్టం విలువ తెలిసిన కుటుంబం నుంచి వచ్చిన ఆడబిడ్డను ఎన్నుకున్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి కూలీ పనులు చేసి.. పార పట్టి పొద్దంతా కష్టం చేసి.. జీవనం సాగించిన ఓగుల రాజేందర్.. అదే చోట తాపీ మేస్త్రీగా ఎదిగారు. సుతారీ మేస్త్రీగా( బిల్డర్‌గా) ప్రజల్లో చక్కటి పేరు గడించారు. శ్రమజీవి రాజేందర్ రాజకీయాల్లోనూ రాణించడం విశేషం. కాట్నపల్లి నూతన సర్పంచ్‌గా ఓగుల పూజ రాజేందర్ ఇటీవల ఎన్నికయ్యారు.

**సర్పంచ్‌గిరి**

ఓగుల రాజేందర్ స్థానిక ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా తన సతీమణి పూజను నిలిపి గెలిపించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన తమను ఆదరించాలని రాజేందర్ తన సతీమణి పూజతో కలిసి ప్రజల్లో చేసిన ప్రచారం బాగా కలిసొచ్చింది. గ్రామ ప్రజలు వారిని నిండు మనసుతో ఆశీర్వదించి.. ఓట్లు వేశారు. గ్రామ సర్పంచ్‌గా నిత్యం అందుబాటులో ఉండే వారినే ఆదరించి గెలిపించారని పూజ రాజేందర్ క్యాంపెయిన్ చేయగా, ప్రజలు తమను గెలిపించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాపీ మేస్త్రీగా, సుతారిగా, బిల్డర్‌గా పని చేసిన ఓగుల రాజేందర్ సతీమణి పూజ గ్రామ సర్పంచ్‌గా ఎన్నిక కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌గా పూజ రాజేందర్ చక్కటి సేవలు అందిస్తారని, ప్రజలకు అందుబాటులో ఉంటారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ఢిల్లీ.. ఉక్కిరి బిక్కిరి..!

'సివియర్ ప్లస్' కేటగిరీకి చెందుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి గాలి నాణ్యతలో ఆరోగ్యవంతులకే దగ్గు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, కళ్ల మంటలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాలంగా ఇలాంటి కాలుష్యం కొనసాగితే ఊపిరితిత్తులు, గుండెపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

– బీఎస్–6 ప్రమాణాలు పాటించకుంటే నో ఎంట్రీ..

ఢిల్లీ బీఎస్–6 ప్రమాణాలు పాటించని వాహనాలకు ఇంట్రీ లేదు. నిన్నటినుంచే ఢిల్లీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో గురుగ్రామ్, నోయిడా, ఘాజియాబాద్, నుంచి రోజూ ఢిల్లీ వచ్చే వాహనాలపై ప్రభావం పడనుంది. ఈ నిషేధం వల్ల ఉద్యోగాలు, విద్య, వైద్యం తదితర అవసరాల కోసం వచ్చేవారు ఆల్లర్నేట్ చూసుకోవడంపై ఆలోచనలో పడ్డారు. ఈ నిర్ణయం నేపథ్యంలో ఢిల్లీ సరిహద్దుల్లో తనిఖీలు కఠినంగా ఉండనున్నాయి.

– గ్రాప్–4 అమలు.. అయినా తగ్గని కాలుష్యం

కాలుష్య తీవ్రత పెరుగుతుండటంతో ఢిల్లీ–నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ నాలుగో దశను అధికారులు అమలు చేస్తున్నారు. నిర్మాణ పనులపై కఠిన ఆంక్షలు విధించడంతో పాటు, భారీ వాహనాల రాకపోకలను నియంత్రించారు. పరిశ్రమల కార్యకలాపాలపై పరిమితులు పెట్టి, కాలుష్యం కలిగించే యూనిట్లను తాత్కాలికంగా మూసి వేశారు. అయినప్పటికీ వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో కాలుష్యం తగ్గకపోవడం అధికారులను ఆందోళనకు గురిచే స్తోంది.

– విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం

దట్టమైన పొగమంచు, కాలుష్యం కారణంగా ఢిల్లీలో దృశ్యమానత తీవ్రంగా తగ్గిపోయింది. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలు గందరగోళంగా మారాయి. కొన్ని రోజులుగా వందల విమానాలు ఆలస్యమవుతుండగా, పదుల సంఖ్యలో రద్దయ్యాయి. కొన్ని విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించాల్సి వచ్చింది. ప్రయాణికులు గంటల తరబడి ఎయిర్‌పోర్ట్‌లోనే నిరీక్షించాల్సి రావడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పలు విమానయాన సంస్థలు ప్రయాణికులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రయాణానికి ముందు తాజా సమాచారం తెలుసు కోవాలని సూచిస్తున్నాయి.

– సింగపూర్ అడ్వైజరీ హెచ్చరికలు..

ఈ తీవ్రమైన కాలుష్య పరిస్థితుల నేపథ్యంలో ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో నివసిస్తున్న తమ పౌరులకు సింగపూర్ హైకమిషన్ ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. అవసరం లేని సందర్భాల్లో బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలని, తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే మాస్కులు ధరించాలని సూచించింది. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శ్వాసకోశ సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని హితవు పలికింది.

– ఎప్పటికి ఊరట?

వాతావరణంలో మార్పులు, గాలివేగం పెరగడం లేదా వర్షం పడితే తప్ప కాలుష్యం నుంచి తక్షణ ఉపశమనం లభించే అవకాశాలు కనిపించడం లేదని నిపుణులు చెబుతున్నారు. అప్పటివరకు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేని బయట తిరుగుడు తగ్గించాలని వైద్యులు సూచిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ ఇప్పుడు నిజంగా 'శ్వాస కోసం పోరాడుతున్న నగరం'గా మారిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా ఎయిర్ క్వాలిటీని మెరుగు పరిచేందుకు ఢిల్లీ ప్రభుత్వం అన్నివిధాలు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది.

# సోషల్‌మీడియాను ఉపయోగించుకోవాలి

కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా వెలువడిన తెలంగాణ మాస పత్రిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావం వేగంగా పెరుగుతోందని, దాన్ని ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి శక్తివంతమైన సాధనంగా మలచుకోవాలని మంత్రి సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియాను సమన్వయంతో ఉపయోగించి ప్రభుత్వ విధానాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రజా సంబంధాల అధికారులపై ఉందని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే ప్రజా సంబంధాల అధికారుల పాత్ర మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి జిల్లాకు సమర్థవంతమైన డీపీఆర్‌వోల నియామకం జరగాలని, ఇతర విభాగాల నుంచి డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న విధానాన్ని రద్దు చేయాలని సూచించారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఐఅండ్ పీఆర్ కమిషనర్‌కు ఆదేశించారు. ఈ పునశ్చరణ తరగతులు అధికారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. గత పాలకుల పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సంక్షోభాన్ని ఎదుర్కొందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం స్పష్టమైన దిశలో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. కేవలం రెండేళ్లలోనే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ పాలనలో మార్పు కనిపిస్తోందన్నారు

# ఆదివాసీలను ప్రభుత్వం విస్మరించింది

అధికారంలోకి వచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి కోసం ఏమీ చేయలేదని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఇప్పటివరకు ఎంత నిధులు ఖర్చు చేశారో ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. గిరిజన కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారని, గత 30 ఏళ్లుగా ఒక్క రిక్రూట్‌మెంట్ కూడా జరగలేదని విమర్శించారు. గిరిజనులకు విద్య, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ట్రైబల్ డీఎస్సీ కూడా నిర్వహించలేదని పేర్కొన్నారు. గుత్తికోయ గూడెం, తాండాలలో సింగరేణి గనుల విస్తరణ పేరుతో 70కి పైగా ఆదివాసీ కుటుంబాలను రోడ్డున పడేశారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణ జరిగినప్పుడు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాల్సిన నిబంధనలు ఉన్నా, కేవలం లక్ష రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. నిర్వాసితులకు వెంటనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, లేదంటే హైదరాబాద్‌లో ఉన్న రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కొత్తగూడెం జిల్లాలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు కోసం మంత్రులు కృషి చేయాలని కవిత డిమాండ్ చేశారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు, డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, టీచర్లు ఎంత కష్టపడుతున్నా ప్రభుత్వం సరైన మౌలిక వసతులు కల్పించడం లేదని విమర్శించారు. సింగరేణి అంశంలో ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. ఓసీ– 2 మైన్‌ను ప్రైవేటుపరం చేసే కుట్రను జాగృతి అడ్డుకుంటుందని స్పష్టం



చేశారు. భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామాలను అన్యాయంగా ఆంధ్రప్రదేశ్‌లో కలిపారని కవిత విమర్శించారు. ముంపుతో సంబంధం లేని గ్రామాలను ఏపీలో కలపడం దారుణమని, ఆ గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో బీజేపీ నేతలు, ముఖ్యంగా చంద్రబాబు నాయుడు సహకరించాలని కోరారు. తక్షణ ఉపశమనంగా ఆ ఐదు గ్రామాలకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి రామాలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన నిధులను వెంటనే విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రసాద్ స్కీం కింద భద్రాచలం ఆలయానికి రూ.300 కోట్ల నిధులు ఇవ్వాలని, రాముల వారి మన్యాలను కాపాడేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయించే వరకు జాగృతి జనం బాట కొనసాగుతుందని, ప్రజల తరపున పోరాటం మరింత ఉధృతం చేస్తామని కవిత స్పష్టం చేశారు.

# దేవునూరు ప్రజలకు ధన్యావాదాలు

– కంటెస్టెడ్ సర్పంచ్ కొంగంటి సందీప్



**వేద న్యూస్, హన్మకొండ:**

ప్రజాస్వామ్యం ధనస్వామ్యమైన వేళ తనకు మద్దతు తెలిపిన దేవునూరు గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు కంటెస్టెడ్ సర్పంచ్(స్వతంత్ర) కొంగంటి సందీప్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రూ.లక్షల్లో డబ్బులు ఖర్చు చేస్తూ..ఓటర్లకు మద్యం పంపిణీ చేస్తూ.., ప్రలోభాలకు గురి చేస్తూ.. రకరకాల ఎన్నికల స్టంట్స్ చేస్తూ.. అభ్యర్థులు ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మారుస్తున్నారని పేర్కొన్నారు. ఈ తరుణంలో తాను యువనాయకుడిగా, ప్రజల పక్షాన.. విషయాల ప్రాతిపదికన సమస్యలపై ప్రశ్నించే గళంగా ఉండేందుకు, సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచానని చెప్పారు. ఈ క్రమంలో తనకు 143 ఓట్లు వచ్చాయని, తనకు మద్దతు తెలిపిన గ్రామ ప్రజలందరికీ ధన్యవాదాలు చెబుతున్నానని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధిని కాంక్షించే వ్యక్తిగా తాను తన వంతు పాత్రను పోషిస్తానని సందీప్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో జీరో బడ్జెట్ పాలిటిక్స్ చేయాలనే సదుద్దేశంతో సర్పంచ్‌గా బరిలో నిలిచిన తనకు లభించిన మద్దతు పట్ల సంతృప్తి ఉందన్నారు.

## సహకార సంఘం చైర్మన్ పదవికి

# నీలా రాంచందర్ రాజీనామా



**వేద న్యూస్, కాసిపేట :**

కాసిపేట మండల కేంద్రంలో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నీలా రాంచందర్ తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాసిపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసి ఆమె విజయం సాధించిన విషయం తెలిసిందే. ఒకే వ్యక్తి రెండు పదవులు నిర్వహించకూడదనే నిబంధనను అనుసరించి సహకార సంఘం చైర్మన్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు నీలా రాంచందర్ వెల్లడించారు. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో, తన పదవీకాలంలో సహకరించిన సభ్యులు, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కాసిపేట సర్పంచ్ నీలా రాంచందర్ ను ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, డీసీసీబీ డైరెక్టర్ దుర్గం లక్ష్మీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార వైస్ చైర్మన్ తాటిపాముల శంకర్ గౌడ్, సోగాల సాగర్, జంజిరాల విష్ణుమూర్తి, చెల్ల రమేష్, చుంచు మల్లేష్, సహకార బ్యాంక్ సూపర్‌వైజర్ ప్రదీప్, సీఈవో రాజశేఖర్, భూక్య రాంచందర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు సిరాజ్ ఖాన్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# హెచ్పీవీ వ్యాక్సిన్ పై అవగాహన



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యాధికారిని డాక్టర్ అయోషా సిద్ధిఖా ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్.పి.వి (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ పై క్షేత్రస్థాయిలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు, అంగన్వాడి టీచర్లు, ఆరోగ్య సూపరవైజర్లకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అయోష సిద్ధిఖా మాట్లాడుతూ.. హెచ్.పి.వి వ్యాక్సిన్ ప్రస్తుతం 14 సంవత్సరాలు దాటి, 15 సంవత్సరాలు దాటని బాలికలకు ఒక డోసు ఇవ్వడం జరుతుందన్నారు. స్త్రీలలో వచ్చే గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారణకు ఈ వ్యాక్సిన్ ఉపయోగపడుతుందన్నారు. ఈ వ్యాక్సిన్ ఖరీదు దాదాపు 4వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ముందస్తుగా ఇంటింటి సర్వే, పాఠశాలలో సర్వే నిర్వహించి అర్హులైన బాలకల జాబితాను తయారు చేయడం జరుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణధికారి శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ కృష్ణవేణి, సూపర్ వైజర్లు జ్యోతి, రవి, సుమతి, ఆర్యోగ్య కార్యకర్తలు, ఆశలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ నూతన కార్యవర్గం ఎన్నిక



**వేద న్యూస్, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం పోచమ్మ ఆలయ ఆవరణలో మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామంచ బాబు, ఉపాధ్యక్షుడు మమ్మద్ షాదుల్, ప్రధాన కార్యదర్శి బొజ్జ వెంకటేష్, కోశాధికారి బుర్ర శివ, కార్యవర్గ సభ్యులు మండల శ్రీనివాస్, దూస రాకేష్, మహమ్మద్ రజాక్, నూనె అనిల్, ఈడుగు నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా వంగ రమేశ్



**వేద న్యూస్, హుజురాబాద్ ప్రతినిధి:**

కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా వంగ రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో మర్రిపల్లిగూడెం సర్పంచ్ తో పాటు 12 వార్డులకు గాను 10 వార్డులు బిఆర్ఎస్ గెలుచుకుంది. ఈ సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో గురువారం నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని సన్మానించిన అనంతరం రెండు సార్లు వార్డు మెంబర్ గా గెలిచిన వంగ రమేష్ ను బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి గెలుపొందిన పాలకవర్గానికి శాలు వాలతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వేద న్యూస్

శనివారం డిసెంబర్ 20, 2025

# నూతన సర్పంచ్ కు సన్మానం



**వేద న్యూస్, బోయినిపల్లి:**

స్థానిక ఎన్నికలలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి సర్పంచ్ గా ఎన్నికైన నల్లమోహన్ తో పాటు ఉపసర్పంచ్ మెరుపుల చందన, వార్డు సభ్యులను పద్మశాలి సంఘ భవనంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కృషి చేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించినట్లు సంఘ సభ్యులు తెలిపారు. పద్మశాలి సమాజ సేవా సంఘం అధ్యక్షుడు బిల్ల మల్లేశం, ఉపాధ్యక్షుడు భీమనాథన్ రమేష్ తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వేయి స్తంభాల గుడి పునరుద్ధరణలో కీలక మైలురాయి

- నాట్య మంటపం పనులు పూర్తి
- కాకతీయుల శిల్పకళా వైభవం కాపాడుతూ సంరక్షణ
- వారసత్వ సంపద పరిరక్షణకు కేంద్రం నిబద్ధత
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్ హన్మకొండలోని చారిత్రక వేయి స్తంభాల గుడి పునరుద్ధరణ పనుల్లో కీలక మైలురాయిని అధిగమించడం ఆనందకరమని కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి అన్నారు. కాకతీయుల అద్భుత శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలిచే ఈ ఆలయ నాట్య మంటపం పునరుద్ధరణ పనులు తాజాగా పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే వేయి స్తంభాల గుడి పునరుద్ధరణకు అవసరమైన నిధులు కేటాయించామని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. గత నెలలో వరంగల్ పర్యటన సందర్భంగా ఆలయాన్ని సందర్శించి, పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించినట్లు తెలిపారు. అప్పట్లో పనుల్లో జాప్యం జరగడంపై ఆరా తీసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రాచీన వారసత్వ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా, ఆలయ అసలైన కట్టడపు రూపురేఖలను కాపాడుతూ అత్యంత జాగ్రత్తగా పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు కిషన్ రెడ్డి వివరించారు. కాకతీయుల కాలం నాటి శిల్పకళ, నిర్మాణ నైపుణ్యం యథాతథంగా నిలిచేలా నిపుణుల పర్యవేక్షణలో పనులు నిర్వహించినట్లు తెలిపారు. భారతదేశపు అమూల్యమైన వారసత్వ సంపదను భావి తరాలకు అందించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వేయి స్తంభాల గుడి వంటి చారిత్రక కట్టడాల సంరక్షణ దేశ సాంస్కృతిక గౌరవాన్ని ప్రపంచానికి చాటేలా చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# పాత పద్ధతిలోనే నీటి విడుదల

- రైతుల సమక్షంలో అధికారుల నిర్ణయం



**వేద న్యూస్, టేక్మాల్:**

పాత పద్ధతి ప్రకారం గత వేసవి కాలం సుమారు 250 ఎకరాల పంట సాగుకు అధికారులు నీటిని విడుదల చేశారని, అదేప్రకారం ఈ ఏడాది కూడా వేసవికాలం పంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మెదక్ జిల్లా టేక్మాల్ గ్రామంలోని ఆయకట్టుల చెరువుల పరిధిలోని రైతులతో తహశీల్దార్ తులసిరామ్, ఇరిగేషన్ ఏఈ సుప్రియ శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుధాకర్, రైతుల సమక్షంలో నిర్ణయం తీసుకున్నారు. రైతులతో అధికారులు మాట్లాడుతూ.. 250ఎకరాలు మించకుండా రైతులు పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. అంతకు మించి ఎకరాల పంటలు సాగు చేస్తే పంటలకు చివరి దశలో పంటకు నీరు అందక రైతులకు ఆస్తినష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు

# దేవపూర్ సర్పంచ్ కు బీజేపీ నాయకుల సన్మానం

**వేద న్యూస్, కాసిపేట:**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవపూర్ గ్రామ నూతన సర్పంచ్ సీడం రాందాస్ ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపీ కాసిపేట మండల అధ్యక్షుడు సూరం సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు అచ్యుత్ రావ్ పటేల్, కొమరం జనార్ధన్, కనకరాజు, భీమ్రావులను పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. దేవపూర్ గ్రామ అభివృద్ధికి సర్పంచ్ సీడం రాందాస్ నాయకత్వంలో సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దేవునూరి సంతోష్ కుమార్, రెడ్డి బాలరాజు, ఉపాధ్యక్షుడు బాకీ కిరణ్, దోమల రామచందర్, ముఖ్య నాయకులు పోలవేణి పోషన్న, కార్యదర్శులు గుంపుల సదయ్య, చొప్పదండి విష్ణువర్ధన్, నాయకులు రాజ్ కుమార్, చిలుక మల్లేష్, పర్వతాలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ పై రైతులకు అవగాహన



**వేద న్యూస్, బోయినిపల్లి:**

ఇకపై రైతులు యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని బోయిన్ పల్లి మండల రైతులకు మండల వ్యవసాయ అధికారి ప్రణీత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొబైల్ నంబర్ను ఉపయోగించి రైతులు యూరియా బుకింగ్ అప్లికేషన్లో సులభంగా లాగిన్ అవ్వవచ్చన్నారు. జిల్లాలోని డీలర్ల వారీగా అందుబాటులో ఉన్న యూరియా బ్యాగుల స్టాకు వివరాలు కూడా తనిఖీ చేసుకోవచ్చని తెలిపారు. యూరియా బుకింగ్ పూర్తి చేయడానికి పట్టా భూ యజమానులు, రోఫర్ పట్టాదారులు, నాన్-పట్టా/ఎన్ డి ఎస్ రైతులు, కౌలుదారులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. రిటైలర్లు నివేదించిన రియల్ టైమ్ స్టాక్ లభ్యత ఆధారంగా రైతులు యూరియా బ్యాగులను బుక్ చేసుకోవచ్చని, బుకింగ్ పూర్తయిన తర్వాత, మీ రిఫరెన్స్ కోసం ఒక ప్రత్యేకమైన బుకింగ్ ఐడి రూపొందించబడుతుందని తెలిపారు. అనంతరం రిటైలర్ల నుంచి యూరియా పొందవచ్చని వివరించారు. నేటి నుంచి ఈ యాప్ ప్రారంభించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీదేవి, రజిత, రవళి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువ రైతు మృతి

**వేద న్యూస్, కాసిపేట:**

ఎదురెదురుగా వస్తున్న రెండు బైకు లు ఢీకొని యువరైతు మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం కోమటిచేను గ్రామ శివారులో జరిగింది. మందమర్రి మండలం క్యాతనపల్లి గ్రామానికి చెందిన దొరిశెట్టి హరి ప్రసాద్ (31) గురువారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో దేవాపూర్ నుంచి మందమర్రికి తన బైక్ పై వస్తున్నాడు. అదే సమయానికి కోమటిచేను గ్రామ శివారులో ఎదురుగా అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హరి ప్రసాద్ తలకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో బైక్ నడుపుతున్న బియ్యపు రమేష్కు కూడా గాయాలయ్యాయి. మృతుడి భార్య దొరిశెట్టి మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

- డీజీపీ సమక్షంలో ఆయుధాలతో లొంగిపోయిన పీఎల్జీఏ, డివిజనల్ స్థాయి నేతలు
- పునరావాసం కింద రూ.1.46 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

మావోయిస్టు పార్టీకి తెలంగాణలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో మొత్తం 41 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో పీఎల్జీఏ బటాలియన్తో పాటు డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉండటం గమనార్హం. ఈ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ లేదా కంపెనీ కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా లేదా ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. వారి వద్ద నుంచి ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే - 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు సహా మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్ను స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు తెలంగాణకు చెందినవారుగా అధికారులు తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు తమ నిర్ణయానికి గల కారణాలను వెల్లడించారు. పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో ఎదురవుతున్న తీవ్రమైన జీవన కష్టాలు, భద్రతా బలగాల నిరంతర ఒత్తిడి కారణంగానే హింసను వీడి ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, సాధారణ పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తం మీద రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు అందనున్నట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు మరోసారి పిలుపునిచ్చారు.

# పారంపర్య వైద్యానికి భారత్ గ్లోబల్ వేదిక

నికి ఉపయోగపడే దిశగా సాగిందన్నారు. ఈ కార్యక్రమానికి భారత్ బలమైన అంతర్జాతీయ వేదికగా నిలవడం తనకు ఆనందాన్ని కలిగించిందని ప్రధాని చెప్పారు. ఈ సమ్మిట్ నిర్వహణలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక పాత్ర పోషించిందని, అలాగే భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ చురుకైన భాగస్వామ్యం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిందని మోదీ ప్రశంసించారు. ఈ విజయవంతమైన సదస్సు కోసం డబ్ల్యూహెచ్ఓకు, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖకు, అలాగే ఇందులో పాల్గొన్న అన్ని దేశాల ప్రతినిధులకు ప్రధాని నరేంద్ర మోదీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పారంపర్య వైద్యానికి ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకువచ్చే దిశగా ఈ సమ్మిట్ కీలక అడుగుగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

# కేంద్ర ఆర్థిక మంత్రితో చంద్రబాబు భేటీ

అత్యంత అవసరమని పేర్కొన్నారు. విశాఖపట్నంలో యూనిటీ మాల్ నిర్మాణం, అఖండ గోదావరి ప్రాజెక్టు కింద చేపట్టిన హావ్లాక్ బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు, గండికోట పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో మూడు వర్కింగ్ విమెన్ హాస్టళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని సీఎం కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. అదేవిధంగా రాయలసీమ ప్రాంతానికి హార్టికల్చర్ డెవలప్మెంట్ ప్యాకేజీ అమలుకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు.

# రూ.1300 కోట్ల ల్యాండ్ సేఫ్!

**వేద్య న్యూస్, మేడ్చల్ మల్కాజిగిరి:**

బాచుపల్లి మండలం నిజాంపేట గ్రామ పరిధిలోని 13 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు శుక్రవారం కాపాడారు. ఈ భూమి విలువ దాదాపు రూ.1300 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే నంబర్లు 186, 191, 334లలో ప్రభుత్వ భూమి అక్రమ కబ్జాకు గురవుతోందని బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా స్పందించింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో సర్వే నంబర్ 334లో ఇప్పటికే నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా కావడంతో పాటు అక్కడ శాశ్వత నివాసాలు కూడా ఏర్పడినట్లు నిర్ధారించారు. నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిని అనంతరం భూమి మొత్తం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. దీని ద్వారా భవిష్యత్తులో మరిన్ని అక్రమ కబ్జాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని అధికారులు స్పష్టం చేశారు. అక్రమ కబ్జాలపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగిస్తామని హైడ్రా వెల్లడించింది.

# ఎలుగుబంటి వేషం వేసిన కొత్త సర్పంచ్..

**వేద న్యూస్ నిర్మల్ జిలా :**



కోతుల బెడదను తప్పించేందుకు కొత్తగా ఎన్నికైన సర్పంచ్ వినూత్న ఆలోచన చేశాడు. ఎలుగుబంటి వేషం వేసుకుని గ్రామం నుంచి కోతులను తరిమికొట్టాడు. నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూర్ గ్రామ యువ సర్పంచ్ కుమ్మరి రంజిత్ చేసిన ఈ ప్రయత్నం ఇప్పుడు అందర్నీ ఆకట్టుకుంటుంది. లింగాపూర్ గ్రామ ప్రజలు రెండు మూడేండ్లుగా కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. s ఈ నేపథ్యంలోనే కోతుల బెడదను తప్పించేందుకు కొత్తగా ఎన్నికైన సర్పంచ్ కుమ్మరి రంజిత్ వినూత్న ఆలోచన చేశాడు. ఎలుగుబంటి వేషం వేసుకుని గ్రామంలో తిరిగాడు. అలా ఎలుగుబంటి కనిపించడంతో కోతులు పరారయ్యాయి. ఇలా వినూత్న ఆలోచనతో కోతుల బెడదను తగ్గించిన యువ సర్పంచ్ను గ్రామస్తులు మెచ్చుకుంటున్నారు.

# ఏపీ పర్యాటకానికి కొత్త శోభ!

- కృష్ణానదిపై కేరళ తరహా హౌస్‌బోట్ టూరిజం
- సుదరమైన నదీ ప్రయాణం.. రాత్రి బస సౌకర్యం
- భవానీ దీవి, ప్రకాశం బ్యారేజ్‌కు అదనపు ఆకర్షణ
- ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

**వేద న్యూస్, విజయవాడ ప్రతినిధి:**



కృష్ణానదిపై కేరళ తరహా లగ్జరీ హౌస్‌బోట్ టూరిజాన్ని ప్రారంభించేందుకు విజయవాడ సిద్ధమవుతోంది. కేరళ బ్యాక్ వాటర్స్‌ను తలపించేలా రూపొందించిన ఈ హౌస్‌బోట్ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి కొత్త ఊపునిచ్చే ప్రయత్నం జరుగుతోంది. నది సహజ సౌంద ర్యాన్ని ఆస్వాదిస్తూ పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందించడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ హౌస్‌బోట్లలో సుందరమైన నది ప్రయాణాలతో పాటు రాత్రి బస సౌకర్యం కూడా ఉండనుంది. ఆధునిక వసతులతో కూడిన సంప్రదాయ డిజైన్‌లో బోట్లు రూపొందించనున్నారు. స్థానిక ఆహార రుచులను పరిచయం చేస్తూ, విశ్రాంతి, వినోద కార్యక్రమాలు కూడా అందుబాటులోకి తీసుకురావాలని టూరిజంశాఖ భావిస్తోంది. కుటుంబాలు, పర్యాటకులు, కార్పొరేట్ ట్రావెల్‌కు అనువుగా ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించనున్నారు.భవానీ దీవి, ప్రకాశం బ్యారేజ్ వంటి ఇప్పటికే ఉన్న పర్యాటక కేంద్రాలకు ఈ హౌస్‌బోట్ టూరిజం మరో అదనపు ఆకర్షణగా నిలవనుంది. కృష్ణానది ఒడ్డున పర్యాటక కార్యకలాపాలు పెరగడంతో విజయవాడ నగరానికి దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటక రంగం విస్తరించడమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. హౌస్‌బోట్ నిర్వహణ, ఆతిథ్య సేవలు, ఆహార సరఫరా వంటి రంగాల్లో ఉద్యోగాలు కలుగుతాయని అధికారులు పేర్కొన్నారు. మొత్తంగా కృష్ణానదిపై కేరళ తరహా హౌస్‌బోట్లు విజయవాడ పర్యాటక ముఖచిత్రాన్ని కొత్త దశకు తీసుకెళ్లనున్నాయి.

# ముంబయికి వరల్డ్‌క్లాస్ మారినా

- రూ.887 కోట్లకు కేంద్రం ఆమోదం
- తీర రవాణా, సముద్ర పర్యాటకానికి కొత్త ఊపు
- 424 యాచ్‌ల నిల్వ సామర్థ్యంతో 'వికసిత్ భారత్ ముంబయి మారినా
- 2,000కిపైగా ఉద్యోగాల సృష్టే లక్ష్యం

**వేద న్యూస్, ముంబయి ప్రతినిధి:**





ముంబయిని గ్లోబల్ సముద్ర పర్యాటక పటంలో ప్రముఖంగా నిలబెట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూ.887 కోట్ల వ్యయంతో వరల్డ్‌క్లాస్ ముంబయి మారినా ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా తీర రవాణా, సముద్ర పర్యాటకం మరింత బలోపేతం కానున్నట్లు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. 'వికసిత్ భారత్ ముంబయి మారినా' పేరుతో 12 హెక్టార్ల సముద్ర జల విస్తీర్ణంలో ఈ మారినాను అభివృద్ధి చేయనున్నారు. ఒకేసారి 30 మీటర్ల పొడవు వరకు ఉన్న 424 యాచ్‌లను నిలిపే సామర్థ్యం ఈ మారినాకు ఉండనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక సౌకర్యాలు, సేవలతో ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దాలని ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టులో ముంబయి పోర్ట్ అథారిటీ రూ.470 కోట్ల పెట్టుబడి పెట్టనుండగా, ప్రైవేట్ రంగం నుంచి రూ.417 కోట్ల పెట్టుబడి రానుంది. ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే ఈ మారినా ప్రాజెక్టు ద్వారా ముంబయి సముద్ర మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడతాయని అధికారులు తెలిపారు. ముంబయి మారినా ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,000కిపైగా ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. సముద్ర పర్యాటకం, తీర రవాణా, బ్లూ ఎకానమీ రంగాల్లో భారత్‌ను ముందంజలో నిలిపే దిశగా ఈ ప్రాజెక్టు కీలక అడుగుగా నిలుస్తుందని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు.

# సర్పంచ్ ఎన్నికపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- ప్రిసైడింగ్ అధికారి అవకతవకలకు పాల్పడ్డారు
- సర్పంచ్ అభ్యర్థి పల్లె రవి కుమార్ గౌడ్ కంప్లయింట్


**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మండలం కోరపల్లి సర్పంచ్ ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారి ఏకపక్షంగా వ్యవహరించి తన ఓటమికి కారణం అయ్యారని సర్పంచ్ అభ్యర్థి పల్లె రవికుమార్ గౌడ్ కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎన్నికల నియమాలకు విరుద్ధంగా తన ఫుట్ బాల్ గుర్తుకు పడ్డ ఓట్లను చెల్లని ఓట్లుగా పరిగణించి, 3 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి గెలుపునకు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామ జెడ్పీహెచ్ఎస్ టీచర్ అలువేల్లి జగన్ సరోతం రెడ్డి(ప్రిసైడింగ్ అధికారి) సహకరించారని ఆరోపించారు. సదరు ప్రిసైడింగ్ అధికారి 2వ, 5వ వార్డుల కౌంటింగ్ దగ్గర ఉంగరం గుర్తు అభ్యర్థికి సహకరించిన విషయానికి సంబంధించి ఆధారాలున్నాయని పేర్కొన్నారు. ఆఫీసర్‌పై, సహకరించిన వారిపై సమగ్ర విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు జమ్మికుంట ఎంపీడీవో గారికీ రవి కుమార్ కంప్లయింట్ చేశారు. ఈ ఫిర్యాదు ప్రతులను హుజూరాబాద్ ఆర్డీవో, స్టేట్ ఎలక్షన్ ఆఫీసర్, ఎంపీడీవో జమ్మికుంట, ఎంఈవో జమ్మికుంట, డీపీవో కరీంనగర్‌లకు పంపినట్టు రవి కుమార్ వెల్లడించారు.

# కేయూ పరిధిలో బీటెక్ పరీక్షలు వాయిదా

**వేద న్యూస్ హనుమకొండ :**



కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఈనెల 22 నుంచి జరగాల్సిన బీటెక్(3,5, 7 సెమిస్టర్లు) పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్ తెలిపారు. వాయిదా పడిన పరీక్షలు ఈనెల 29 నుంచి జరుగుతాయని, పరీక్షల పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తామని, విద్యార్థులు గమనించాలని ఆయన కోరారు.

# రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ ఆధునీకరణకు అడుగులు

- ఇంక్యుబేషన్ హబ్ ప్రారంభించిన నారా లోకేష్
- వందేమాతరం మూవ్‌మెంట్ మెమోరియల్ ఆవిష్కరణ
- గొప్ప అనుభూతిని ఇచ్చిందన్న ఏపీ మంత్రి




**వేద న్యూస్, రాజమహేంద్రవరం:**

ఘన చరిత్ర కలిగిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్‌ను సందర్శించడం తనకు ఎంతో గొప్ప అనుభూతిని ఇచ్చిందని ఏపీ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా నిర్మించిన స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ బ్లాక్‌తో పాటు ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ హబ్‌లను ఆయన ప్రారంభించారు. అలాగే వందేమాతరం ఉద్యమానికి స్మారకంగా ఏర్పాటు చేసిన వందేమాతరం మూవ్‌మెంట్ మెమోరియల్‌ను ఆవిష్కరించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన హై-గ్లో ల్యాబ్ ఆన్ వీల్స్ సైన్స్ ప్రాజెక్ట్‌ను మంత్రి పరిశీలించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, ఆవిష్కరణ దృక్పథం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన కళాశాల విద్యార్థులను అభినందించి, క్రీడలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. కాలేజీ లైబ్రరీని సందర్శించిన మంత్రి నారా లోకేష్ అక్కడ ఉన్న అరుదైన పుస్తకాలను పరిశీలించారు. విద్యతో పాటు పరిశోధనకు గ్రంథాలయాలు కేంద్రబింద ువులుగా మారాలని, ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన అకడమిక్ వాతావరణం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆధునిక వసతులతో ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి గవర్నమెంట్ కాలేజీ (ఆటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామచంద్రరావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమండ్రి ఆర్టీఐహెచ్ నోడల్ ఆఫీసర్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతతోనే స్వచ్ఛ నగరం సాధ్యం



- స్వచ్ఛ సర్వేక్షణా కార్యక్రమంలో జీహెచ్ఎంసీ
- పాఠశాలలు, వీధులు, కాలనీల్లో ప్రతిధ్వనించిన శుభ్రత సందేశం
- పలు చోట్ల స్వచ్ఛతా ప్రతిజ్ఞలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

స్వచ్ఛ నగరం ఒక్క రోజులో సాధ్యం కాదని, ప్రతి రోజు పౌరుల బాధ్యతతోనే అది సాధ్యమవుతుందని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది. శుక్రవారం నగరవ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాలు ఈ సందేశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాయి. పాఠశాలలు, వీధులు, కాలనీల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, స్థానికులు, స్వచ్ఛత సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్న వయస్సులోనే శుభ్రత అలవాట్లు అలవరుచుకోవడం ఎంత ముఖ్యమో, ప్రజా స్థలాల పట్ల గౌరవం, అవగాహన, సామూహిక బాధ్యత ఎలా నగర రూపును మార్చగలవో ఈ కార్యక్రమాలు గుర్తు చేశాయి. నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను తిరిగి శుభ్రంగా మార్చుకునే దిశగా ప్రజలు ముందుకు రావడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ చెత్తను తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లలో వేయాలని, రోజూ స్వచ్ఛ ఆటోలకు చెత్తను అందించాలని, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లలో చెత్త వేయరాదని సూచించింది. వీధులు, ఫుట్‌పాత్‌లు, ప్రజా స్థలాలను శుభ్రంగా ఉంచాలని, తడి పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, చెత్త ఉత్పత్తిని తగ్గించి పునర్వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరింది. ప్రజల సహకారంతో స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యాన్ని సాధిస్తామని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# డాక్టర్లు లేకుండా వైద్యం ఎలా?

## - బస్తీ దవాఖానాల్లో నిర్లక్ష్యంపై హరీశ్‌రావు ఫైర్

- మందుల కొరత, జీతాల బకాయిలపై ఆగ్రహం
- వెంటనే వైద్యులను నియమించాలని డిమాండ్




**వేద న్యూస్, సిద్దిపేట:**

బస్తీ దవాఖానాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో ఉన్న బస్తీ దవాఖానను శనివారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన, అక్కడ డాక్టర్ లేకపోవడాన్ని గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లు లేకుండా ప్రజలకు వైద్య సేవలు ఎలా అందిస్తారని అక్కడి సిబ్బందిని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేటలో నాలుగు చోట్ల బస్తీ దవాఖానలు ఏర్పాటు చేశామని హరీశ్‌రావు గుర్తుచేశారు. కేసీఆర్ నగర్‌లోని ఒక దవాఖానను మినహాయిస్తే, కాళ్లకుంట కాలనీ, లింగారెడ్డిపల్లి, ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలోని మూడు బస్తీ దవాఖానాల్లో గత ఆరు నెలలుగా డాక్టర్లు లేరని విమర్శించారు. మెడికల్ ఆఫీసర్ గది పెచ్చులు ఊడిపోయి, డాక్టర్ కూర్చునే కుర్చీపై దుమ్ము పట్టి ఉండటాన్ని చూసి ఇదేనా బస్తీ దవాఖానల పరిస్థితి అని ప్రశ్నించారు. డాక్టర్లు లేకపోవడమే కాకుండా మందుల కొరత కూడా తీవ్రంగా ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. మల్టీ విటమిన్‌లు, లోప్రైమైడ్, లివో సిట్రిజన్, మెటాఫిన్ ఉన్నప్పటికీ, తప్పనిసరిగా ఉండాల్సిన గ్లిమిఫిరైడ్ 2 ఎంజీ మందు అందుబాటులో లేదని తెలిపారు. చిన్నపిల్లలకు అవసరమైన జింక్ సల్ఫేట్ కూడా లేనట్టు తెలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ రాడు, మందులు లేవు.. అలాంటప్పుడు ప్రజలకు వైద్యం ఎలా అందుతుందని నిలదీశారు. పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలను కాంగ్రెస్ ప్రభుత్వం సుస్తీ దవాఖానలుగా మార్చిందని హరీశ్‌రావు విమర్శించారు. ఒకవైపు ఆరు నెలలుగా డాక్టర్లు రావడం లేదని, మరోవైపు అటెండర్‌కు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, స్టాఫ్ నర్స్‌కు నవంబర్ జీతం కూడా రాలేదని తెలిపారు. ప్రజా వైద్యంపై నిర్లక్ష్యం వీడాలని, వెంటనే బస్తీ దవాఖానల్లో వైద్యులను నియమించి, సకాలంలో మందులు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.

# సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

**వేద న్యూస్ సికింద్రాబాద్ :**



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని మోండా మార్కెట్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. మార్కెట్‌లోని శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మోండా మార్కెట్ నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ప్రమాద వార్త వేగంగా వ్యాపించి జనాలు ఆందోళనకు గురయ్యారు. అగ్ని ప్రమాదం సమయంలో దట్టమైన పొగలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో మోండా మార్కెట్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానికులు స్వయంగా దుకాణాల నుంచి బయటకు పరుగులు తీస్తూ సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. పలువురు సిబ్బంది కలిసి ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను నియంత్రించారు. మంటలు చుట్టుపక్కల దుకాణాలకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన దుకాణంలో ప్లాస్టిక్ వస్తువులు అధికంగా నిల్వ ఉండటంతో మంటలు తీవ్రంగా వ్యాపించాయని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించే అంశమని చెప్పారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

వేద న్యూస్

శనివారం డిసెంబర్ 20, 2025

# గులాబీ సైనికుడు వంగ రమేశ్

- బీఆర్ఎస్ వాయిస్‌ను బలంగా వినిపించే యువనేత
- విద్యార్థి రాజకీయాల నుంచి క్రియాశీలక పాలిటిక్స్‌లోకి
- చిన్నవయసులోనే గులాబీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నిక
- మర్రిపల్లిగూడెంలో బీఆర్ఎస్ బలోపేతానికి విశేష కృషి







**వేద న్యూస్, హుజూరాబాద్ ప్రతినిధి:**

తాను నమ్మిన పార్టీని గెలిపించడం కోసం సైనికుడిలా పని చేయడం, పదవితో సంబంధం లేకుండా కార్యకర్తగా.. చేయగలిగిన పనులన్నింటినీ తన భుజాన వేసుకుని.. అందరినీ కూడగట్టుకుని పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడం.. ఇదీ సంక్షిప్తంగా బీఆర్ఎస్ యువనేత, గులాబీ పార్టీ మర్రిపల్లిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ రమేశ్ నిత్యదినచర్యని చెప్పొచ్చు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన రమేశ్.. విద్యార్థి రాజకీయాల్లో నుంచి క్రియాశీలక పాలిటిక్స్‌లోకి వచ్చి చిన్న వయసులోనే మండలంలోనే పెద్ద గ్రామానికి బీఆర్ఎస్ అధ్యక్షుడిగా తాజా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. 29 ఏండ్ల వయసులోనే ఇప్పటికే రెండు సార్లు వార్డు సభ్యులుగా ఎన్నికయిన రమేశ్.. తాజాగా సర్పంచు ఎన్నికల్లో గ్రామంలోని 12 వార్డులకు 10 వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడేలా తన వంతు కృషి చేశారు. తాజాగా ఆయన వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు.

**రమేశ్ మది నిండా గులాబీ జెండా**

సోషల్ మీడియాతో పాటు బయట కూడా నిత్యం బీఆర్ఎస్ పార్టీ వాయిస్‌ను యువ లీడర్ రమేశ్ ప్రజల్లోకి తీసుకెళ్తుంటారు. పార్టీ విధానపరమైన నిర్ణయాలను, విధానాలను ఎప్పటికప్పుడు పోస్ట్ చేస్తూ.. శ్రేణుల్లో ఉత్తేజం నింపే ప్రయత్నం చేస్తుంటారు. 2013లో నాటి టీఆర్ఎస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన రమేశ్.. టీఆర్ఎస్వీ నేతగా కీలక పాత్ర పోషించారు. టీఆర్ఎస్వీ అధ్యక్షుడిగా రెండు టర్ములు పని చేశారు. టీఆర్ఎస్వీ నేతగా ఉన్న రమేశ్‌పై కేసులూ నమోదయ్యాయి. అనంతరం 2018లో జరిగిన స్థానిక ఎన్నికల్లో వంగ రమేశ్ వార్డుమెంబర్‌గా ఎలక్ట్ అయ్యారు. ఇక కీలకమైన హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో బీఆర్ఎస్ లీడర్లు బాల్క సుమన్, గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ల సహకారంతో మర్రిపల్లిగూడెం గ్రామ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. పార్టీ బలోపేతానికి తన వంతుగా శక్తివంచన లేకుండా కృషి చేశారు.

**ఉన్నత విద్యావంతుడు రమేశ్**

డిగ్రీ బీఏ హెచ్ఈపీ(హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్) చదివిన ఉన్నత విద్యావంతుడు వంగ రమేశ్.. రాజకీయాల్లో రాణిస్తున్నారు. 29 ఏండ్ల వయసులోనే వార్డుమెంబర్‌గా బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ప్రజల్లో ఉంటున్నారు. బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నాయకత్వంలో సర్పంచు ఎన్నికల్లో సత్తా చాటామని, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్స్‌లో ప్రభం'జనం' సృష్టిస్తామని రమేశ్ ధీమా వ్యక్తం చేస్తూ చెబుతున్నారు. తాను పార్టీ ఆదేశించిన పనిని తూ.చ. తప్పకుండా చేస్తానని, శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి పాటు పడతానని వెల్లడిస్తున్నారు. పల్లెల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని, ఇందుకు సర్పంచ్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని, రాబోయే అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్ల పాటు సం'క్షేమ' పాలన కొనసాగిందని, ప్రస్తుతం ప్రజలు గోసపడుతున్నారని, ఎన్నిక ఏదైనా మరోసారి బీఆర్ఎస్‌కు జనమే అవకాశం ఇస్తారని పేర్కొంటున్నారు.

# నూతన సర్పంచ్‌కు గ్రామస్తుల ఘనస్వాగతం

- విలాసాగర్‌లో విజయోత్సవ ర్యాలీ
- భారీగా తరలివచ్చిన ప్రజలు



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన గరిగంటి శ్రీధర్‌కు శుక్రవారం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత గ్రామంలో శుక్రవారం భారీగా తరలివచ్చిన ప్రజల మధ్య విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుండి భారీగా ర్యాలీ చేయగా, శ్రీధర్‌కు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. తనపై అభిమానంతో ఆశీర్వదించి గెలిపించిన గ్రామస్తుల రుణం తీర్చుకుంటానని చెప్పారు. ఐదు సంవత్సరాల కాలంలో ప్రతి ఇంటికి బిడ్డలా సేవలు అందిస్తానని, ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని తెలిపారు. గ్రామస్తులు తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చు కుంటానని పేర్కొన్నారు. ఈ విజయోత్సవ ర్యాలీ ద్వారా తమ అభిమానాన్ని చాటుకున్న



సహచర మిత్రులు, స్నేహితులు, ఆడబిడ్డలు అన్నదమ్ములకు గ్రామ పెద్దలకు పేరుపేరునా శిరస్సు వంచి నమస్కరి స్తున్నానని తెలిపారు. తన గెలుపునకు కారణమైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతపూర్వకంగా ఉంటానని గ్రామ సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని, గ్రామస్తులు అందరూ కూడా తన ఆత్మీయ బంధువులే అని పేర్కొన్నారు. ఏ రంగంలోనైనా గెలుపు ఓటములు సహజమని.. గెలిచిన వారు ఓడిన వారు అందరూ తన ఆత్మీయులేనని తప్పకుండా అందర్నీ కలుపుకొని.. గ్రామ అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో నూతన పాలకవర్గం తో పాటు గ్రామస్తులు మహిళలు యువతీ యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం

- అసమానతల ప్రపంచంలో ఐక్యత అవసరం
- భవిష్యత్తును కాపాడే ఒకే మార్గం

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచం వేగంగా ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తున్నా, ఆ వేగం మానవత్వాన్ని మరిచిపోతున్న పరిస్థితులు స్పష్టంగా దర్శనమిస్తున్నాయి. యుద్ధాల మంటలు, శరణార్థుల వేదనలు, ఆకలి అరుపులు, అసమానతల గోడలు ఇవన్నీ నేటి ప్రపంచానికి ప్రతిరోజూ కనిపిస్తున్న దృశ్యాలే. ఇలాంటి సమయంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 20న నిర్వహించే అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం ఒక సాధారణ క్యాలెండర్ గుర్తుగా కాకుండా, మానవ సమాజానికి ఇచ్చే హెచ్చరికగా నిలుస్తోంది. మనం ఎటు వెళ్తున్నాం? మన ప్రయాణం మానవత్వం వైపేనా? అన్న ప్రశ్నలను ఈ రోజు ముందుంచుతోంది.

మానవ ఐక్యత అనేది కేవలం దయతో చేయబడే సహాయం కాదు. అది నైతిక బాధ్యత. ఒక మూల దేశంలో పుట్టిన శిశువు ఆకలితో అలమటిస్తే, మరో మూల దేశంలో ఉన్న సంపన్న సమాజం దానికి బాధ్యత వహించాల్సిందే. ఎందుకంటే ప్రపంచం నేడు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంది. ఆర్థిక వ్యవస్థలు, వాణిజ్యం, వాతావరణం, ఆరోగ్యం ఏది కూడా ఒంటరిగా లేదు. అయినా, బాధలు పంచుకునే విషయంలో మాత్రం సరిహద్దులు గీయడం మానవత్వానికి విరుద్ధం. ఈ అసమాన ధోరణినే ఐక్యరాజ్యసమితి ప్రశ్నిస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి పేరుతో సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. కోట్లాది మంది కనీస అవసరాల కోసం పోరాడుతుండగా, కొంతమంది అపారమైన సంపదను కూడబెట్టుకుంటున్నారు. ఈ అంతరం సమాజాన్ని మౌనంగా కాకుండా, ప్రమాదకరంగా చీల్చేస్తోంది. పేదరికం కేవలం ఆదాయ లోపం కాదు. అది అవకాశాల లేమి, గౌరవం కోల్పోవడం, భవిష్యత్తుపై ఆశలు మసకబారడం. అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం ఈ వాస్తవాలను ప్రపంచం కళ్లముందు ఉంచుతోంది. అసమానతలు తగ్గించకుండా శాంతి సాధ్యం కాదని. భారతదేశంలో శతాబ్దాల క్రితమే "వసుధైక కుటుంబకం" అనే భావన జన్మించింది. ప్రపంచమంతా ఒకే కుటుంబమనే ఈ తత్వం నేటికీ ప్రాసంగికమే. కానీ ఆ ఆలోచనను మనం ఎంతవరకు ఆచరణలో పెట్టాం అన్నది ప్రశ్న. కులం, మతం, భాష, ప్రాంతం పేర్లతో మనమే మన మధ్య గోడలు కట్టుకుంటున్నాం. ఐక్యత గురించి మాట్లాడే సమాజమే విభజనలకు వేదికగా మారడం ఒక పెద్ద విరోధాభాసం. ఈ రోజు మనల్ని మనమే ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది. వాతావరణ మార్పు మానవ ఐక్యత అవసరాన్ని మరింత స్పష్టంగా చూపిస్తోంది. ఒక దేశం విడుదల చేసే కాలుష్యం ప్రభావం మరో దేశంపై పడుతోంది. సముద్ర మట్టం పెరుగుదల, కరువు, వరదలు ఇవి సరిహద్దులను గౌరవించవు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం కూడా సామూహికంగా ఉండాల్సిందే. దేశాల స్వార్థ రాజకీయాలు కొనసాగితే, భవిష్యత్ తరాలకు భద్రమైన ప్రపంచం మిగలదు. ఐక్యత అనేది ఇక ఎంపిక కాదు అది అవసరం.

అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం మనకు చెప్పే అసలు సందేశం స్పష్టం. ఐక్యత అంటే బలహీనుల పక్షాన నిలబడటం. అన్యాయాన్ని ప్రశ్నించడం. లాభం కంటే విలువలను ముందుంచడం. ప్రభుత్వాలు విధానాల్లో, సమాజాలు ప్రవర్తనలో, వ్యక్తులు ఆలోచనల్లో మార్పు తెచ్చినప్పుడే ఈ దినోత్సవానికి అర్థం ఉంటుంది. లేదంటే ఇది కూడా మరొక పేరాగ్రాఫ్‌గా, మరొక తేదీగా మిగిలిపోతుంది.

ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి పేరుతో సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. కోట్లాది మంది కనీస అవసరాల కోసం పోరాడుతుండగా, కొంతమంది అపారమైన సంపదను కూడబెట్టుకుంటున్నారు. ఈ అంతరం సమాజాన్ని మౌనంగా కాకుండా, ప్రమాదకరంగా చీల్చేస్తోంది. పేదరికం కేవలం ఆదాయ లోపం కాదు. అది అవకాశాల లేమి, గౌరవం కోల్పోవడం, భవిష్యత్తుపై ఆశలు మసకబారడం. అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం ఈ వాస్తవాలను ప్రపంచం కళ్లముందు ఉంచుతోంది. అసమానతలు తగ్గించకుండా శాంతి సాధ్యం కాదని. భారతదేశంలో శతాబ్దాల క్రితమే "వసుధైక కుటుంబకం" అనే భావన జన్మించింది. ప్రపంచమంతా ఒకే కుటుంబమనే ఈ తత్వం నేటికీ ప్రాసంగికమే. కానీ ఆ ఆలోచనను మనం ఎంతవరకు ఆచరణలో పెక్యత గురించి మాట్లాడే సమాజమే విభజనలకు వేదికగా మారడం ఒక పెద్ద విరోధాభాసం. ఈ రోజు మనల్ని మనమే ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది. వాతావరణ మార్పు మానవ ఐక్యత అవసరాన్ని మరింత స్పష్టంగా చూపిస్తోంది.

ప్రపంచ భవిష్యత్తు ఆయుధాల్లో లేదు, సంపదలో లేదు. అది మన మధ్య ఉన్న మానవ బంధాల్లోనే ఉంది. ఐక్యత లేకుండా శాంతి లేదు. న్యాయం లేకుండా ఐక్యత లేదు. మానవత్వం లేకుండా అభివృద్ధి లేదు. ఈ సత్యాన్ని అంగీకరించిన రోజే అంతర్జాతీయ మానవ ఐక్యత దినోత్సవం నిజమైన విజయం సాధించినట్టవుతుంది.

# రాత్రివేళలో ఎన్నిసార్లు మూత్రవిసర్జన ఆరోగ్యకరం



- డాక్టర్ ఊడుగుల సురేశ్ కీలక సూచనలు

**వేద న్యూస్, జమ్మికుంట:**

రాత్రిపూట నిద్రలో లేచి బాత్‌రూమ్‌కు వెళ్లడం అనేది చాలా సాధారణం. అయితే, ఇది ఎప్పుడు సమస్యాత్మకంగా మారుతుంది? చాలా మందికి, రాత్రికి ఒక్కసారి మేల్కొనడం సాధారణంగా పరిగణించబడుతుంది. అంతకంటే ఎక్కువసార్లు జరిగితే, అది మీ నిద్రను, మొత్తం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ?చీకటిలో నిద్రలేచి మూత్రవిసర్జన చేయడం అనేది చాలా మంది పెద్దగా పట్టించుకోని విషయం. కానీ ఈ అలవాటు మీ శరీర పరిస్థితి గురించి కీలక విషయాలను వెల్లడిస్తుంది. నిద్రకు భంగం కలిగినా సరే, మూత్రాన్ని ఆపుకోవడం కూడా ప్రమాదకరమే. దీనినే నోక్టూరియా గురించి అర్థం చేసుకోవడం ద్వారా, ఏది సాధారణమో, ఏది ఆరోగ్య సమస్యకు సంకేతమో మనం గుర్తించవచ్చు. ఇందుకు సంబంధించిన విషయాలను ప్రముఖ వైద్యుడు, గోల్డ్ మెడలిస్ట్, కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఊడుగుల సురేశ్ వివరించారు. ఆ ముఖ్యమైన సూచనలు మీ కోసం..

**నోక్టూరియా అంటే..**

రాత్రిపూట మూత్రవిసర్జన కోసం మేల్కొనడాన్ని వైద్య భాషలో 'నోక్టూరియా' అంటారు. ఇంటర్నేషనల్ కాంటినెన్స్ సొసైటీ (ఐసీఎస్) ప్రకారం, రాత్రికి ఒక్కసారి నిద్రలేవడం సాధారణ పరిమితుల్లోనే ఉంటుంది. ?కానీ, ఒకటికి మించి ఎక్కువ సార్లు మేల్కొనడాన్ని నిపుణులు 'పాథలాజికల్ నోక్టూరియా' అని పిలుస్తారు. ఇది ఒక వ్యాధి కాదు, కానీ శరీరంలో దాగి ఉన్న ఇతర ఆరోగ్య సమస్యలకు ఇదొక లక్షణం. తరచుగా నిద్రకు భంగం కలగడం వల్ల అలసట, చిరాకు, నిద్రలేమికి సంబంధించిన ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ?సాధారణంగా మనం నిద్రపోతున్నప్పుడు, శరీరం మూత్ర ఉత్పత్తిని తగ్గిస్తుంది. కాబట్టి ఆదర్శంగా అయితే, రాత్రిపూట ఒక్కసారి కంటే ఎక్కువసార్లు మేల్కొనాల్సిన అవసరం ఉండకూడదు.

**తరచూ మూత్రవిసర్జనకు కారణాలు**

రాత్రిపూట అధిక మూత్రవిసర్జనకు అనేక వైద్యపరమైన కారణాలు ఉండవచ్చు.ప్రోస్టేట్ సమస్యలు: పురుషులలో అయితే, ప్రోస్టేట్ గ్రంథి వాపు, డయాబెటిస్ (మధుమేహం) ఇది మూత్ర ఉత్పత్తిని పెంచుతుంది. గుండె లేదా మూత్రపిండాల వైఫల్యం కూడా రీజన్ కావచ్చు. ?స్లీప్ అప్నియా: నిద్రలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు., ?నరాల సంబంధిత సమస్యలు: మూత్రాశయ నియంత్రణపై ప్రభావం చూపేవి ఉంటాయి. ?వయస్సు పెరిగే కొద్దీ మూత్రాశయం సామర్థ్యం కూడా సహజంగా తగ్గుతుంది, ఇది కూడా ఒక కారణం కావచ్చు.

**నోక్టూరియాను పెంచే రోజువారీ అలవాట్లు**

అన్నిసార్లు ఇది అనారోగ్యం వల్లనే కాకపోవచ్చు, కొన్ని అలవాట్లు కూడా దీనికి కారణం కావొచ్చు. ?పడుకోవడానికి రెండు గంటల ముందు ఎక్కువ ద్రవాలు తీసుకుంటే రాత్రి నిద్రలేవక తప్పదు. ?మద్యం, కెఫీన్.. ఇవి మూత్ర ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. ? రక్తపోటు కోసం వాడే కొన్ని రకాల మందులు, గర్భాశయం మూత్రాశయంపై ఒత్తిడి తేవడం వల్ల వస్తాయి.

**ఇవీ చిట్కాలు**

కొన్ని చిన్న మార్పుల ద్వారా రాత్రిపూట మేల్కొనడాన్ని తగ్గించవచ్చు. ?ద్రవాల నియంత్రణ.. పడుకోవడానికి 2 నుండి 3 గంటల ముందు నీరు లేదా ఇతర పానీయాలు తాగడం తగ్గించండి. సాయంత్రం వేళల్లో ఆల్కహాల్, టీ, కాఫీలకు దూరంగా ఉండండి. : క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల నిద్ర నాణ్యత పెరుగుతుంది. 'పెల్విక్ ఫ్లోర్' వ్యాయామాలు మూత్రాశయ నియంత్రణకు సహాయపడతాయి. ఈ మార్పులు చేసినప్పటికీ సమస్య తగ్గకపోతే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిదని డాక్టర్ సురేశ్ వెల్లడించారు.

# అక్రమ బెట్టింగ్ యాప్‌ల వెనుక నేర నెట్‌వర్క్

- తెలంగాణ పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్ వేద న్యూస్ :**




అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల వెనుక భారీ నేర నెట్‌వర్క్ పనిచేస్తోందని తెలంగాణ పోలీసులు ప్రజలను హెచ్చరించారు. ఆకర్షణీయమైన లాభాల పేరుతో యువతను, సామాన్యులను మోసగిస్తూ ఈ యాప్‌లు ఆర్థిక నేరాలు, మోసాలు, సైబర్ నేరాలకు దారితీస్తున్నాయని స్పష్టం చేశారు. అక్రమ బెట్టింగ్ యాప్‌లపై తెలంగాణ పోలీసుల కఠిన చర్యలు రాష్ట్రాలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. బెట్టింగ్ ద్వారా సంపాదన అన్నది భ్రమ మాత్రమేనని, చివరకు బాధితులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ యాప్‌ల వెనుక సంఘటిత నేర ముఠాలు ఉండి, మనీ లాండరింగ్, డేటా దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడుతున్నాయని వెల్లడించారు. అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహించడం, ప్రచారం చేయడం కూడా చట్టరీత్యా నేరమేనని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియా, డిజిటల్ వేదికల్లో బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలను నమ్మవద్దని, వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. చట్టబద్ధమైన మార్గాల్లోనే వినోదం, ఆటలను ఆస్వాదించాలని కోరారు. ప్రజలు చట్టం పక్షాన నిలబడి, అక్రమ బెట్టింగ్‌కు మద్దతు ఇవ్వకుండా సహకరిస్తేనే ఈ నేర నెట్‌వర్క్‌లను పూర్తిగా అరికట్టగలమని తెలంగాణ పోలీసులు స్పష్టం చేశారు. అక్రమ బెట్టింగ్‌పై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073